## ఘనంగా తొలి ఏకాదశి


పోట్లమర్రిలో ప్రత్యేక పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి


బత్తలపల్లిలో విశేష పూజలందుకుంటున్న లక్ష్మి వెంకటేశ్వరుడు

**బత్తలపల్లి, జూన్ 29 ప్రభాతవార్త** : మండలంలోని పలు గ్రామాలలో తొలి ఏకాదశి పండుగను రైతులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం రైతులు విత్తన ఏకాదశి పండుగను పురస్కరించుకుని పంటలు బాగా పండాలని, సకాలంలో వర్షాలు కురిసి, తెగుళ్లభారిన పంటలు పడకుండా మంచి దిగుబడి రావాలంటూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాక కొందరు ఏకాదశి పండుగ సందర్భంగా ఉపవాసాలు ఉన్నారు. ఉపవాసాలు ఉంటే సంవత్సరమంతా శుభమే జరుగుతుందని రైతులలో అపారమైన నమ్మకం. ఉదయం లేచిన వెంటనే అందరూ దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలోని ఆలయాలలో ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బాధిత కుటుంబాలకు ఎంఎల్ఏ సతీమణి ఆర్థిక సాయం


బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న ఎంఎల్ఏ సతీమణి కేతిరెడ్డి సుప్రియ

**బత్తలపల్లి, జూన్ 29 ప్రభాతవార్త** : మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన తండ్రి, కొడుకుల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకోగా వారి కుటుంబాలకు ఎంఎల్ఏ సతీమణి కేతిరెడ్డి సుప్రియ ఆర్థిక సాయం అందజేశారు. డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన బెస్త నారాయణ, బెస్త నరేష్లు వరుసగా ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. గురువారం ధర్మవరంలోని ఎంఎల్ఏ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్వగృహంలో మృతుల కుటుంబ సభ్యులకు ఆమె రూ. 50వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట వైకాపా నాయకులు చల్లాక్రిష్ణ ఉన్నారు.

## త్యాగానికి ప్రతీక బక్రీద్

**శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్**


ప్రత్యేక ప్రార్ధనలలో పాల్గొన్న ముస్లింలు

**బత్తలపల్లి, జూన్ 29 ప్రభాతవార్త** : ముస్లింల పండుగలలో ప్రత్యేకమైన పండుగ బక్రీద్ అని, త్యాగాలకు ప్రతిరూపంగా ముస్లింలు బక్రీద్ను జరుపుకుంటారని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్బాబు అన్నారు. గురువారం బక్రీద్ పండుగను మండలంలోని పలు గ్రామాలలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ ఒకరి నొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాకు వెళ్లిన ముస్లింలు అక్కడ మౌళానా చేపట్టిన ప్రత్యేక ప్రార్ధనలలో పాల్గొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని అనంతపురం రోడ్డులోని పోలీస్స్టేషన్ సమీపంలో వున్న ఈద్గాకు వెళ్లిన కోటి సూర్యప్రకాష్బాబు ముస్లింలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పేద, ధనిక భేదం లేకుండా అందరూ ఈ పండుగను జరుపుకుంటారని ముత్తవల్లిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తవల్లిలు కరంసాబ్, జిలాన్బాషా, సులేమాన్, మాబాషా, సత్తార్, టైలర్ బాబా, రియాజ్, నడిమింటి హసన్, ముత్తుం సాబ్, ముస్తఫా, ఖాసీం వలి తదితరులు పాల్గొన్నారు. ఈద్గాలో ముస్లంలు ప్రార్దనలు చేస్తున్న దృష్ట్యా ఎస్ఐ శ్రీహర్ష తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## మదర్ప్లాంట్లో 20 లీటర్లు ఇవ్వాల్సిన నీరు తక్కువ ఎందుకు

**అగళి, జూన్ 29 ప్రభాతవార్త** : అగళి సంత మార్కెట్లో మధర్ప్లాంట్ ద్వారా 18 గ్రామాలకు అక్కడి నుంచి నీటిని సిస్టన్లకు సరఫరా చేసి ట్యాంకర్ల ద్వారా అందులోకి నీటిని నిల్వ చేసి 5 రూపాయల కాయిన్ వేస్తే 20 లీటర్లుమంచి నీరు రావాలి, కానీ మదర్ప్లాంట్ ద్వారా తీసుకుపోయి నీటి ట్యాంకు ద్వారా వచ్చే నీరు 20 లీటర్లురావడం లేదని కేవలం 15-16 లీటర్లు మాత్రమే వస్తున్నాయని వినియోగ దారులు అంటున్నారు. కరెంటు పోయినప్పుడు అందులోకి కాయిన్ వేస్తే అటు నీళ్లు రాక ఇటు కాయిన్రాక నష్టపోతున్నామని ఇదిచాలా ఇబ్బందికరమైన పరిస్థితిఅని నీటి వినియోగదారులు అంటున్నారు. అందులో నీళ్లు ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు ఉండవో నీటి కోసం బిందెలతో కాయిన్లు తీసుకుని వెళ్తే అంతే సంగతులని నీటి వినియోగ దారులు అంటున్నారు. కరెంటు ఉన్నప్పుడు 20లీటర్లు రావాల్సిన నీరు చాలా తక్కువ మోతాదులో వస్తున్నాయని మదర్ప్లాంట్ ద్వారా సరఫరా చేసే నీరు మండలంలో అన్ని చోట్ల 18 గ్రామాల్లో కూడా తక్కువ మోతాదులో వస్తున్నాయని, దీనిని సంబధిత అధికారులు స్పందించి 20 లీటర్లు వచ్చే విధంగా సిస్టం మార్చాలని అదే విధంగా కరెంటు లేనప్పుడు నీళ్లు రాకపోతే పోనిగాని, కాయిన్లు బయటికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తాగునీటిని వాడుకునే మహిళలు అంటున్నారు.

## ఘనంగా ఏకాదశి వేడుకలు


గుడ్డగ రంగనాథస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**అగళి, జూన్ 29 ప్రభాతవార్త** : సంవత్సరంలో తొలిపండుగ అయిన ఏకాదశిని భక్తులు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. వేకువ జామునే స్నానం ఆచరించి ఉపవాస దీక్షతో విష్ణు దేవాలయాలకు భక్తులు వెళ్లారు. ఉల్లెకెర కొండపైన ఉన్న రంగనాథస్వామికి ఏకాదశి సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అగళి పాండురంగస్వామి దేవాలయంలో కూడా ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ మొదటి పండుగను బాగా చేస్తే సంవత్సరాంతం అంతా మంచే జరుగుతుందని మిగతా పండగలు కూడా బాగా జరుపుకోవచ్చుని భక్తుల విశ్వాసం.

## పార్కింగ్ ఏరియాగా మారిన ప్రభుత్వాసుపత్రి ఆవరణం..!


ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలు

**ఉరవకొండ, జూన్ 29 ప్రభాతవార్త** : నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి ఆవరణం వాహనాల పార్కింగ్ ఏరియాగా మారిపోయింది. వివిధ కార్యాలయాల్లో పనుల కోసం వచ్చే వారు, ఊళ్లకు వెళ్లేవారు తమ ద్విచక్రవాహనాలు, కార్లను ఆసుపత్రి ఆవరణంలో నిలిపి ఉంచుతుండటంతో అంబులెన్స్లు, రోగులు ఆసుపత్రిలోకి రావడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆసుపత్రి ఆవరణంలోకి ఎవరుపడితేవారు వచ్చి వాహనాలు నిలిపి వెళ్లిపోతున్నా వాచ్మెన్లు వాటిని అడ్డుకోలేకపోతుండటం విమర్శలకు తావిస్తోంది. ఆసుపత్రి అధికారులు రోగులకు సంబంధంలేని వాహనాలు ఆసుపత్రిలోకి రాకుండా, ఎక్కడపడితే అక్కడ నిలిపి ఉంచకుండా తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

## విశ్వేశ్వరరెడ్డిను విమర్శించే స్థాయి, అర్హత జనసేన నాయకులకు లేదు

**- విలేఖరుల సమావేశంలో మండిపడిన వైసీపీ నాయకులు**




**ఉరవకొండ, జూన్ 29 ప్రభాతవార్త** : నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిను విమర్శించే స్థాయి, అర్హత జనసేన పార్టీ నాయకులకు లేదని వైసీపీ నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరాన్ బాషా, యువజన విభాగం అధ్యక్షుడు ఎస్.ధన్రాజ్, వైసీపీ విద్యార్థి విభాగం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.జిలాన్బాషా, కార్యదర్శి వంశీ, మైనార్టీ నాయకులు వడ్ల సలీమ్, అన్వర్, యం.రఫీక్ తదితరులు మాట్లాడారు. జనసేన జిల్లా కార్యదర్శి గౌతమ్కుమార్ ఏ అర్హత ఉందని విశ్వేశ్వరరెడ్డిను విమర్శిస్తున్నారని హద్దులు మీరితే తగిన బుద్ధి చెబుతాం అన్నారు. జనసేన అధినేత పవన్కళ్యాణ్ పార్ట్ టైం రాజకీయాలు చేస్తున్నారు కాబట్టే ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఉన్నమాటను చెప్పారన్నారు. నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిపై ఎప్పుడు, ఎక్కడైనా చర్చకు సిద్ధమని దీన్ని జనసేన నాయకులు స్వీకరిస్తారో లేదో చెప్పాలని సవాల్ చేశారు. చంద్రబాబు డైరెక్షన్లోనే పవన్కళ్యాణ్ వారాహి యాత్ర చేస్తున్నారని 2024 ఎన్నికల్లో సొంతంగా పోటీచేసి 175 స్థానాల్లో అభ్యర్థులను నిలిపే సత్తా ఉందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో విద్యార్థి విభాగం నాయకులు తేజ, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదిన వేడుకలు

**- ఈద్గా మైదానంలో ముస్లీంల సామూహిక ప్రార్థనలు**

**- హాజరైన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్రెడ్డి**


ఉరవకొండ ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్ధనలు చేస్తున్న ముస్లీం సోదరులు


ప్రార్థనల్లో పాల్గొన్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్రెడ్డి


**ఉరవకొండ, జూన్ 29 ప్రభాతవార్త** : త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ గురువారం నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. స్థానిక ఈద్గా మైదానంలో ముస్లీంలు సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్రెడ్డి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ మతమైనా, ఏ గ్రంధమైనా దేవుడు ఒక్కడే, తోటి వారిని ప్రేమించు.. చేతనైనంత సాయం చెయ్యమని చెబుతున్నాయని వాటిని ఎవ్వరూ మరువరాదన్నారు. అల్లా దయతో వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రార్థనలకు హాజరైన ముస్లీం సోదరులు పలువురిని ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పారు. మత పెద్ద ఖతీబ్సాబ్ మాట్లాడుతూ తమవద్దనున్న సంపదనైనా, ఆహారాన్నైనా లేనివారికి పంచాలని చెప్పడమే బక్రీద్ పండుగ మనకిచ్చే సందేశమని దాన్ని ప్రతిఒక్కరూ పాటించాల్సిన అవసరముందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ వి.హరినాథ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## వైభవంగా అషాడ తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు

**- కన్నుల పండువగా పాండురంగస్వామి కళ్యాణం, గ్రామోత్సవం**

**- విఠల్ రుక్మిణీ ఆలయాల్లో మహాపూజ, విష్ణు సహస్రనామాలు**


పాండురంగస్వామి గ్రామోత్సవం జరుగుతున్న దృశ్యం


గరుడ వాహనంపై కొలువైన స్వామి, అమ్మవారు
విఠల్, రుక్మిణీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యాలు

**ఉరవకొండ, జూన్ 29 ప్రభాతవార్త** : శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఆషాడ తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు గురువారం వైభవంగా జరుగగా మండల వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతూ కనిపించాయి. పట్టణంలోని స్థానిక బ్రాహ్మణ వీధిలోగల పురాతన పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఆలయం ముందు ఏర్పాటుచేసిన వేదికలో స్వామివారి కళ్యాణోత్సవాన్ని మేళతాళాలు, వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య వైభవంగా నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ట్రాక్టర్లో స్వామివార్ల ఉత్సవమూర్తులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక విఠల్ రుక్మిణీ విజయ వృద్ధ అనాధాశ్రమంలోని విఠల్, రుక్మిణీ అమ్మవార్ల ఆలయాల్లో నిర్వాహకులు, విద్యావేత్త డి.ఎర్రిస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, మహాపూజ, విష్ణు సహస్రనామం భగవద్గీత పారాయణాలు, ప్రత్యేక పూజలు కొనసాగగా వందలాది మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

**తొలి ఏకాదశి విశిష్టత** : ఈ సందర్భంగా విద్యావేత్త డి.ఎర్రిస్వామి మాట్లాడుతూ తొలిఏకాదశిని శయన ఏకాదశి అని అంటారని ఈరోజు నుండి శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోకి ప్రవేశిస్తారన్నారు. మహత్ములు ఈరోజు నుండి చాతుర్మాస ప్రారంభం గావించి కార్తీక మాసం శుద్ధ ఏకాదశి నాడు ముగిస్తారన్నారు. సనాతన భారత సాంప్రదాయం ప్రకారం ఏకాదశి వ్రతం చాలా పవిత్రమైనదని ఏకాదశిరోజు ఐదుకరేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలను కట్టడిచేసి మనసును ఏకాగ్రతతో భగవంతునిపై నిలిపి ఉపవాస వ్రతము పాటించి మరుసటిరోజు ద్వాదశి ఘడియలు రాగానే కనీసం ఒకఅతిధికైనా భోజనంపెట్టి ఏకాదశివ్రతాన్ని విరమిస్తారని వివరించారు.

## ఘనంగా బక్రీదు పండుగ

**తాడిమర్రి, జూన్ 29 ప్రభాతవార్త**

తాడిమర్రి మండలంలో ముస్లిం సోదరులు గురువారం బక్రీదు బండుగను భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. స్థానిక మసీదులో సామూహిక ప్రార్ధనలు జరిపి ఒకరికొకరు బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ మండలంలోని పెన్నదరి, చిల్లకొండాయిపల్లి, అగ్రహారం తదితర గ్రామల్లో కూడా ముస్లింలు బక్రీదు పండుగ జరుపుకున్నారు.

## గురుపౌర్ణమి వేడుకలకు పెద్ద ఎత్తున సన్నాహాలు


సాయిబాబా కమిటీ సభ్యులు పట్టణ పెద్దలలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

**మడకశిర టౌన్, జూన్ 29 ప్రభాతవార్త** : పట్టణంలో వెలసిన షిర్డి సాయిబాబా దేవాలయంలో జులై రెండవ తేది నుంచి నిర్వహించనున్న గురు పౌర్ణమి వేడుకలకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేపట్టారు. ఈ విషయంపై ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి గురు పౌర్ణమి వేడుకలు ఏ విధంగా నిర్వహిచాలి అన్న అంశంపై చర్చించడమే కాకుండా బాధ్యతలను సైతం అప్పగించారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా ఎవరెవరు ఏఏ కార్యక్రమాలను పరిశీలించాలన్న అంశంపై బాధ్యతలు అప్పగించారు. మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్రెడ్డి, ప్రభాకర్రెడ్డి గోపి, అక్కంపల్లిబాబు, లక్ష్మినారాయణ, మనోహర్, పుల్లయ్యచౌదరి, ఓబులేసు, మాధవరాజు, మంజునాథ్, బయన్న, టీచర్ శివన్న, జయరాం, యమనపల్లి ఆనంద్, వెంకటేషులు, తిమ్మరాజు, కుళ్లాయప్ప, డిష్ రమేష్, డిష్ కాంట్రాజ్, గోపాల్, టీచర్, ఆదినారాయణ, సుబ్బరాయుడు, సోము, రవి, బుల్లెట్ రమేష్, నాగరాజు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నీలకంఠాపురం దేవస్థానాలలో తొలిఏకాదశి పూజలు


ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

**మడకశిర జూన్ 29 ప్రభాతవార్త** ; తొలిఏకాదశి సందర్భంగా మండల పరిధిలోని నీలకంఠాపురం లోని దేవాలయాలలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం సుదర్శన నరసింహ హోమము, శ్రీనరసింహస్వామికి పంచామృతాభిషేకం అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. పూజల అనంతరం శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆలయ వీధుల్లో ఊరేగింపు జరిపి అనంతరం మహామంగళ హారతినిచ్చి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు నరేష్స్వామి, శ్రీనివాస్స్వామి మరియు భక్తులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన



ప్రశంసాపత్రాలను చూపుతున్న దృశ్యం

**గుంతకల్లు టౌన్, జూన్ 29 ప్రభాతవార్త** : రెడ్ డ్రాప్ యువజన సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం బక్రీద్ సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఎస్జెపి హైస్కూల్, సయ్యద్మస్తాన్వలిబాబాదర్గా, తిమ్మనచెర్ల ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది యువకులు స్వచ్ఛంధంగా వచ్చి రక్తదానం చేశారు. ప్రధానంగా హైదరాబాద్కు చెందిన గోపరాజు శ్రీనివాసరాజు 225వ సారి, మహేందర్రెడ్డి 87, రాజు 34వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ డ్రాప్ ఫౌండర్ రహిమాన్, అధ్యక్షులు గులాంమహమ్మద్, ప్రధాన కార్యదర్శి షఫి, ఉపాధ్యక్షులు దివాకర్, కోశాధికారి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు


ఏకలవ్యుని చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**గుంతకల్లు టౌన్, జూన్ 29 ప్రభాత వార్త** : ఎరుకుల వంశ యుగపురుషుడు ఏకలవ్య జయంతి వేడుకలను ఏపి ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం పట్టణాధ్యక్షులు, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు గురుగుంట్ల ప్రభాకర్ మాట్లాడుతూ ఏకలవ్యుని దీక్ష పట్టుదలను ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలని ఆయన కోరారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సంఘం కార్యకర్తలు వై.తిప్పప్ప, వై.బసప్పల ఆత్మశాంతి కొరకు మౌనం పాటించారు. అంతముందు ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కరేపాకు నాగరాజు, ఎం.వరప్రసాద్, వై.వివేకానంద, కమలపాడు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ వేడుకలు

**గుత్తి, జూన్ 29 ప్రభాతవార్త** : గుత్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గురువారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా మైదానంలో నిర్వహించిన సామూహిక నమాజ్లో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైకాపా కన్వీనర్లు శ్రీనివాసరెడ్డి, హుసేన్పీరా, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందన్నారు. ఖబరస్థాన్లో ముస్లింల సౌకర్యార్థం 15 లక్షలతో ప్రహరీతో పాటు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చైర్పర్సన్ వన్నూర్బీ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

## కిలో టమోటా ధర రూ.100..!

**- నెలరోజుల్లోనే నాలుగైదు రెట్లు పెరిగిన ధర**

**- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు**



**ఉరవకొండ, జూన్ 29 ప్రభాతవార్త** : టమోటా ధర చుక్కలనంటుతోంది. కిలో టమోటా ప్రస్తుతం మార్కెట్లో 100 రూపాయలకు చేరుకుంది. దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నెల రోజుల క్రితం వరకు కిలో 20 నుంచి 30 రూపాయల మధ్య ఉన్న ధర అనూహ్యంగా నాలుగైదు రెట్లు పెరిపోయింది. హోల్ సేల్ మార్కెట్లలో అయితే 70 నుంచి 80 రూపాయలు ధర ఉండగా రిటైల్ వ్యాపారులవద్ద 100 రూపాయలకు దగ్గడంలేదు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వర్షాధారం కింద సాగు చేసిన పంట చేతికందలేదని బోర్లు, బావుల కింద సాగులోవున్న పంట చేతికందాలంటే మరో నెల, రెండు నెలలు పడుతుందని తెలుస్తోంది. జూలైలో ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి కూరలోనూ రుచి కోసం టమోటాను వినియోగించడం జరుగుతోందని ధర పెరిగిన కారణంగా రుచీ పచీలేని కూరలు వండుకోవాల్సి వస్తోందని మహిళలు చెబుతున్నారు.

## వైభవంగా తొలి ఏకాదశి


**తాడిమర్రి, జూన్ 29 ప్రభాతవార్త** : మండలంలో తొలి ఏకాదశి పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగాఉదయాన్నే తలస్నానాలుజరిపి, ఇష్టదైవ దేవాలయాలకు వెళ్లి పూజలునిర్వహించారు. తాడిమర్రి మండలంలోని లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు జయరామయ్య స్వామి పంచామృతాభిషేకం నిర్వహించి కుంకుమార్చన అష్టోత్తర శతనామావలి, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని స్వామివారిని దర్శించుకుని ఫల పుష్పాలు స్వీకరించారు. అలాగే లక్ష్మి నరసిహస్వామి ఆలయంలోని లక్ష్మి నరసిహస్వామి ఆలయంలో కూడా పూజలు నిర్వహించారు. పురాతన కాలంనాటి శివాలయంలో విక్రమార్కస్వామి శివునివిగ్రహానికి పంచామృతాభిషేకంనిర్వహించిపూజలునిర్వహించారు. భక్తులకుతీర్థప్రసాదాలు అందజేశారు.

## కుక్కల దాడిలో 30 గొర్రెపిల్లలు మృతి..


కుక్కల దాడిలో మృతి చెందిన 30 గొర్రె పిల్లలు

**తాడిమర్రి, జూన్ 29 ప్రభాతవార్త** : తాడిమర్రి గ్రామానికి చెందిన కురుబ గంగయ్యకు చెందిన 30 గొర్రెలు కుక్కలు గాయపర్చడంతో మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే.. గొర్రెలు మేపుకుటూ కుటుంబ పోషణ చేసుకుంటున్న గంగయ్య యదావిధిగా తన ఖాళీ స్థలంలో ఉంచాడు. మధ్యాహ్నం అనుకోకుండా గొర్రెలపై కుక్కలు దాడి చేసి వాటిని గాయపర్చడంతో గొర్రెలు మృతిచెందాయి. కొన్ని గొర్రెలకు కుక్కలు కరవడంతో రక్తమాంసాలు బయటపడ్డాయి. పశువైద్యాధికారి స్వర్ణలత సంఘటనా స్థలానికి వెళ్లి శవపంచనామా నిర్వహించారు. దీంతో గంగయ్యకు 3 లక్షలకుపైగా నష్టం జరిగింది. ప్రభుత్వం పేదవాడైన గంగయ్యను ఆదుకుని ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు


ఈద్గామైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

**పుట్టపర్తిటౌన్, జూన్ 29, ప్రభాతవార్త** : ముస్లిం సోదరులకు పవిత్రమైన బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గురువారం పట్టంలోని రెండు మసీదుల్లో ప్రార్థనలు అనంతరం ర్యాలీగా ఎనుములపల్లి సర్కిల్లో ఈద్గాకు వెళ్ళారు. అక్కడ ప్రార్థనాలు చేశారు. బక్రీద్ పండుగ త్యాగాలకు ప్రత్యేకంగా ముస్లింలు భావిస్తారు. ముతవల్లీల ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు తమ శక్తి కొద్ది దానధర్మాలు చేశారు. పలువురు హిందూవులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు ముస్లిం సోదరులకు ఈద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లింలు హిందూసోదరులకు విందులకు ఆహ్వానించి సౌభ్రాతృత్వం చాటుకున్నారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి


ఏకలవ్యునిచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**పుట్టపర్తిరూరల్, జూన్ 29, ప్రభాతవార్త** : ఎరుకల ఆరాధ్యదైవం, ఎరుకల జాతి మూల పురుషుడు ఏకలవ్యుని జయంతి వేడుకలను శ్రీసత్యసాయి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సి, ఎస్టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు గుజ్జల సురేష్ మాట్లాడుతూ, ప్రతి యేటా తొలిఏకాదశి పర్వదినాన్ని ఏకలవ్యునిజయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇతర మహనీయుల జయంతులు ఏలా నిర్వహిస్తారో ప్రభుత్వం ఏకలవ్యునిజయంతిని కూడా అలాగే ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు గుజ్జల వెంకటరాముడు, కోమెరి శ్రీనివాసులు, నాయకులు దేవరకొండ ప్రసాద్, సాకే నరసింహులు, రామాంజినేయులు, మారుతి, ఏకరుల హక్కుల పరిపరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎరుకల శంకర, ముత్యాలు, సాకే నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## వరుణుడి కరుణ కోసం గంగమ్మపూజ

**గుత్తి, జూన్ 29 ప్రభాతవార్త** : పట్టణంలోని చారిత్రక చెరువు కట్టపై గంగమ్మపాదాల చెంత గురువారం వరుణుడి కరుణకై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిజెఆర్ ట్రస్ట్ చైర్మన్, టిడిపి నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువులో వందలాది ఎకరాలు కబ్జాకు గురికావడం వల్ల వర్షం నీరు చేరేందుకు కష్టతరమైందన్నారు కాలువలు సైతం ధ్వంసమయ్యాయన్నారు. వర్షాలు కురిసి ప్రజలకు తాగు, సాగునీరు పుష్కలంగా వుండి సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరిడికొండ సూరి, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

## జూలై 3న అనంతపురం జిల్లా కలెక్టరేట్లో నిరసన కార్యక్రమం

**- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు**

**ఉరవకొండ, జూన్ 29 ప్రభాతవార్త** : న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 3న అనంతపురం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిరసనకార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సీఐటీయూ ఉపాధ్యక్షులు జి.ఓబులు, యూనియన్ అధ్యక్షులు హెచ్.తిప్పేస్వామి, కోశాధికారి యం.శ్రీరాములు తెలిపారు. గురువారం యూనియన్ ఆన్లైన్ సమావేశం అనంతరం తీసుకున్న నిర్ణయాలపై వారు ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్లో 572మంది కార్మికులు గత 23సంవత్సరాలుగా పనిచేస్తూ 800గ్రామాల్లోని 12 లక్షల కుటుంబాలకు తాగునీటిని అందిస్తున్నారన్నారు. శ్రీ సత్యసాయి వాటర్ స్కీమ్ నిర్వహణకు ఇకమీదట నిధులు ఇవ్వమని ఇప్పటినుంచి నీటిని వినియోగించుకొనే మున్సిపాలిటీ, పంచాయతీల నుండే నిధులు సమీకరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్డబ్ల్యూఎస్ సంస్థకు ఇచ్చిన మెమో ఉపసంహరించుకోవాలన్నారు. కరువు జిల్లాలో శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ తాగునీటి పథకం నిర్వాహణకు గతంలో మాదిరి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి నిధులు విడుదలచేసి కార్మికులకు 3 నెలల బకాయి వేతనాలు, 11నెలల ఇ.ఎస్.ఐ,బోనస్, గ్రాట్యూటీ చెల్లించాలన్న న్యాయమైన డిమాండ్లతో నిరసన చేపట్టాలని నిర్ణయించామన్నారు. పంచాయతీలు కొన్ని మున్సిపాలిటీల్లో కనీసం చెత్త ఊడ్చేందుకు పరకలు, కార్మికులకు వేతనాలు సంవత్సరాల కొద్ది ఇవ్వలేని పరిస్థితులు ఉంటే వారిపై శ్రీ సత్యసాయి సంస్థ నిర్వహణ బాధ్యతకూడా పెట్టడమంటే స్కీమ్ను మూసివేయడమే అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా రక్షిత తాగునీరు ప్రజలకు అందించే బాధ్యత నుండి తప్పుకోవడం ద్వారా తాగునీటిని అమ్ముకొనేటువంటి వ్యాపారులకు, వారి పార్టీకార్యకర్తలకు లాభంచేకూర్చడమే అవుతుందన్నారు. తాగునీటిని ప్రజలకు ఉచితంగా అందించడం ప్రభుత్వాల బాధ్యతని మరువరాదన్నారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు స్పందించి సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్ను కాపాడుకోవాలని కోరారు. ప్రజలు కార్మికులు చేసే ఉద్యమానికి మద్దతును, సంఘీభావాన్ని తెలపాలని, అంచెల వారిగా చేపట్టే కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరారు.

# తెలుగులో సరిగా మాట్లాడలేని అసమర్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

## - పవన్‌ను వ్యక్తిగతంగా విమర్శించడం తగదు

## - మీడియా సమావేశంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవ ప్రతాప్

కదిరి, జూన్ 29 ప్రభాతవార్త

తెలుగులో సరిగా మాట్లాడలేని అసమర్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవ ప్రసాద్ వైకాపా సర్కారుపై ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇష్టానుసారంగా వ్యక్తిగతంగా పవన్‌ను విమర్శించడం తగదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించ లేని ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రజల దీవెనలు పొందుతూ వారాహి యాత్ర దిగ్విజయంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యలు ఎత్తి చూపుతున్న పవన్ కళ్యాణ్‌పై మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో గంపెడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైకాపా ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను అయోమయంలోకి నెట్టేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా కి గట్టిగా బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాజేంద్ర ప్రసాద్, రవికుమార్, మహబూబ్‌బాషా, అంజిబాబు, లోకేష్, ప్రతాప్, సోమశేఖర్, రాజశేఖర్, ఇర్ఫాన్, హరిబాబు, చంద్రశేఖర్, రాజు, ఉత్తప్ప, బాబా, గోపీనాథ్, నాగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు



అయ్యప్పస్వామి మూలవిరాట్

ఓబుళదేవరచెరువు, జూన్ 29, ప్రభాతవార్త : మండల కేంద్రానికి సమీపంలోని యం కొత్తపల్లి బం డపై వెలసిన శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం ఆషాడ తొలి ఏకాదశిని పురస్క రించుకుని ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు ఆధ్వ ర్యంలో విశిష్ట పూజలు నిర్వహిం చారు. తొలుత ఆదిదేవుడు విద్యాగణపతి, వేలాయుధ సుబ్రహ్మణ్యం స్వామి వారికి పుసుపు, కుంకుమ, పుష్పాలతో అలకంరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి అభిషేకం నిర్వహించి అనంతరం భక్తుడు సొదీ నాగరాజు సమర్పించిన నూతన వస్త్రాలను స్వామివారికి అలంక రించి భక్తులకు దర్శనం కల్పించారు. సమీప గ్రామాలను విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

# రాయలసీమ విద్య, వైజ్ఞానిక, సైద్ధాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

## - కరపత్రాలు విడుదల చేసిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకులు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఉరవకొండ, జూన్ 29 ప్రభాతవార్త

జూలై 4,5,6 తేదీల్లో మంత్రాలయంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాయలసీమ విద్య, వైజ్ఞానిక, సైద్ధాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చిరంజీవి పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక ఐదుకల్లు సదాశివన్ భవనంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించిన అనంతరం స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. విద్య ప్రైవేటీకరణ, కాషాయికరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. నూతన జాతీయ విద్యావిధానంను దేశంలోని మేధావులు, విద్యావంతులు, విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ప్రభుత్వ విద్య దూరమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ఇంట్లో ఒకరికే వర్తిస్తుందని సవాలక్ష నిబంధనలు పెట్టడం, రాష్ట్రంలో ఖాళీగావున్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడిను అరికట్టకపోవడం దారుణమన్నారు. శిక్షణా తరగతులకు పెద్దఎత్తున విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, రాజేష్, నవీన్, భార్గవ్, ఆనంద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల కోసం ప్రధాని మోడి అనేక పథకాలు ప్రవేశపెట్టారు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బిజెపి నాయకులు

పుట్లూరు, జూన్ 29 ప్రభాతవార్త

దేశంలోని పేద ప్రజల కోసం భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని బిజెపి శింగనమల కన్వీనర్ రవిరాజ్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ముచ్చుకోట శివ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడి 9 ఏళ్ల పాలనపై దేశంలో ఆయన అమలు చేసిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బిజెపి మండల నాయకులు గురువారం మండలంలోని మడ్డిపల్లి, కొండుగారికుంట, వెల్లుట్ల, జంగంరెడ్డిపేట, తదితర గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రధాని మోడి అమలు చేసిన పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పేదలకు ఇళ్లు, కరోనా సమయంలో వ్యాక్సిన్లు,ఉచిత బియ్యం పంపిణీ, ఆడపిల్లల కోసం సుకన్యసమృద్ధియోజన పథకం, గర్భవతులకు మాతృవందనయోజన, పౌష్టికాహారం, గ్రామాల్లో స్వచ్ఛభారత్ కింద మరు గుదొడ్ల నిర్మాణం, పిఎం కిసాన్ సమ్మన్ నిధి కింద ప్రతి ఏటా రైతులకు 6 వేల రూపాయలు పెట్టుబడి సాయం, చిరువ్యాపారులకు ముద్రలోన్లు, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద గ్రామీణరోడ్డు, జలజీవన్‌మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు. తదితర పథకాలతో ప్రధాని భారతదే శాన్ని ముందుకు తీసుకెళుతు న్నార న్నా రు. 2024 ఎన్ని కల్లో మరో దఫా నరేంద్రమోడిని ప్రధానిని చేసుకుంటే భారతదే శం సంక్షే మం, రాష్ట్రాలు అభివృద్ధి చెం దుతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కుందూ శ్రీనివాసులురెడ్డి, ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు రాగేని రామాం జి యాదవ్, మండల ఇన్‌చార్జ్ వెంకటయ్య, ఉపాధ్యక్షులు నర సింహారెడ్డి, శింగనమల మండల అధ్యక్షులు ఆదినారాయణ, గార్లదిన్నె మండల ఉపాధ్య క్షులు కణంపల్లి గోపాల్, కాశేపల్లి సుదర్శన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభ అమోఘం - క్లాస్-I కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

యాడికి, జూన్ 29 ప్రభాతవార్త

మండలంలోని కోనఉప్పలపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది గురుకుల పాఠశాలకు 16 మంది విద్యార్థులు ఎంపిక కావడంతో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి వారికి గురువారం పాఠ్యపుస్త కాలతో పాటు చదువుకు కావాల్సిన సామాగ్రిని వారికి అందచేశారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బదిలీపై వెళుతున్న వారిని చవ్వా గోపాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు బాగా చెప్పడం వల్లే గురుకుల పాఠశాలకు 16 మంది విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషించతగ్గ విషయమని ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులను కొనియాడారు. విద్యార్థులు అంకితభావంతో, ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో ఉన్నతమైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవా లన్నారు. రాబోవు రోజుల్లో ప్రభు త్వ పాఠశాలలో చదువు తు న్న విద్యార్థుల ఎదుగు దల కోసం తనవంతు పూర్తి సహకారం అందిస్తానని విద్యార్థులకు ఆయన హామి ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపా ధ్యా యులు, గ్రామస్తులు రా మాంజినేయులు, రామకృ ష్ణ, అనంతపురం తెలుగు దేశ ం పార్టీ జిల్లా ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు గండికోట లక్ష్మణ్, రియల్ ఎస్టేట్ వ్యాపారి బద్దెల రాముడు, తదిత రులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



ప్రార్థనలకు తరలివెళుతున్న ముస్లింలు

యాడికి, జూన్ 29 ప్రభాతవార్త

మండలంలోని యాడికి, రాయలచెరువు, తదితర గ్రామాల్లో ముస్లింలు గురువారం బక్రీద్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయమే ముస్లిం సోదరులు ఆయా మసీదుల ఆవరణలో సమూహికంగా అల్లాను స్తుతిస్తూ, కీర్తిస్తూ బక్రీద్ పర్వదినం ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గా మైదానంకు తరలివెళ్లారు. సామూహిక ప్రార్థనల్లో మతపెద్దలు ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతూ బక్రీద్ పండుగ విశిష్టత గురించి వివరించారు. బక్రీద్ పర్వదినం త్యాగ నిరతికి చిహ్నమని, త్యాగముతో పాట ఓర్పు, సహనం కలిగి వుండాలని, ఎటువంటి పరిస్థితుల్లో కూడా సత్యం, ధర్మం, న్యాయమును విడవకూడదన్నారు. మహమ్మద్‌ప్రవక్త పాటించిన, అనుసరించిన విధానాలు సాధారణ జీవితంలో ప్రతి ముస్లిం సోదరుడు వీటిని అన్వయించుకోవాలని పలు అమూల్యమైన సందేశాలను అందించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకుంటూ ముస్లిం సోదరులు ఆలింగనం చేసుకుని ఈద్ ప్రాముఖ్యతను పెంపొందించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఎఎస్ఐ వెంకటేష్, పోలీసులు పవన్‌కుమార్‌రెడ్డి, గౌడులు పర్యవేక్షించారు.

# ఘనంగా ఈద్ అల్ -అదా వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

ఓబుళదేవరచెరువు, జూన్ 29, ప్రభాతవార్త : మండల కేంద్రం, కొండకమర్ల, గౌనిపల్లి, గాజుకుంట పల్లి, టి కుంట్లపల్లి తదితర గ్రామాల్లో ముస్లిం సోదరసోదరీమణులు గురువారం ఈద్ అల్-అదా(బక్రీద్) వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సమీప ఈద్గా మైదానాల్లో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు బక్రీద్ యొక్క విశిష్టత గురించి తెలియచేశారు. సమసమాజ హితం కోసం అల్లా ఆజ్ఞ మేరకు మహ్మద్ ప్రవక్త తన కుమార్లో ఒకరిని త్యాగం చేయడానికి సిద్ధపడ్డాడన్నారు. ఆ త్యాగాన్ని స్మరిస్తూ ఈద్ అల్-అదా జరుపుకుంటారన్నారు. మహ్మద్ ప్రవక్త తన కుమార్ని త్యాగం చేయడానికి సిద్ధమైనప్పుడు అల్లా అడ్డుకుంటాడన్నారు. అతని స్థానంలో జంతు బలి ఇవ్వాలని ఆదేశిస్తాడన్నారు. దానికి ప్రతీకగా మేకలు, గొర్రెలు, ఇతర జంతువులను బలి ఇవ్వడం ప్రతీతి అన్నారు. త్యాగం, కరుణ, సోదరభావం, దాతృత్వం, సేవాభావంల సమ్మిళతమే బక్రీద్ అన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# జగనన్న సురక్ష కార్యక్రమం



జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

**రొద్దం,జూన్ 29,ప్రభాతవార్త:** మండల పరిధిలోని రొద్దంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్,సర్పంచ్ రూపా,స్వచ్ఛ ఆంధ్రస్టేట్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి,తహశీల్దార్ అనంతచారి,ఎంపిడిఓ రాబర్ట్ జాన్ విల్సన్,సచివాలయ మండల కన్వీనర్ ఆర్.ఎ.రవిశేఖర్‌రెడ్డి,సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధురాలికి భోజనం వడ్డిస్తున్న దృశ్యం

యాడికి, జూన్ 29 ప్రభాతవార్త

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమంలో గురువారం ఎలక్ట్రీషియన్ అల్లాబకాష్ తన కుటుంబసభ్యులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. త్యాగనిరతికి చిహ్నమైన బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి, వృద్ధులు పాల్గొన్నారు.

# యల్లనూరులో ఘనంగా బక్రీద్ వేడుకలు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఐ రామకృష్ణ



ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

యల్లనూరు, జూన్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక ఈద్గా మైదానంలో గురువారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మతగురువు ఖాజీమహమ్మద్‌అస్లాం ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ నమాజ్‌ను చదివారు. కుర్బాని గొప్పతనం గురించి ముస్లిం సోదరులకు తెలియచేశారు. ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో వుండాలని అల్లాకు వేడుకుని దువా చేశారు. అనంతరం దర్గా మైదానంలో ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపి ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



తలుపుల ఈద్గాలో ప్రార్థనలో పాల్గొన్న సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులురెడ్డి

తలుపుల, జూన్ 29 ,ప్రభాతవార్తః

మండల వ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు.బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గాలకు వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ముఖ్యంగా ముస్లింలు ఈ పండుగను త్యాగనిరితికి భవంతుడి పట్ల సంపూర్ణ భక్తి విశ్వాసాలు కలిగి,దయా దాతృత్వానికి ప్రతీకగా జరుపుకొన్నారు.పలువురు నాయకులు ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియచేశారు.

# పట్టణ శాంతి భద్రత కాపాడటంలో మరింత కృషి చేచండి



మాట్లాడుతున్న ఎస్పి మాధవరెడ్డి

**ధర్మవరం,జూన్ 29, ప్రభాతవార్త:** పట్టణంలో శాంతి భద్రతలను కాపాడటంలో మరిం త కృషి చేయాలని డి.ఎస్.పి శ్రీనివాసులుకు ఎస్పి మాధవరెడ్డి సూచించారు.ఈ సందర్భంగా గురువారం ఆకస్మికంగా పట్టణములోని పలు కూడలిలను వారు పరిశీలించారు.ఇందులో భాగంగా రైల్వే స్టేషన్,ఆర్టిసి బస్టాండ్,కదిరి గేట్ తదితర ప్రాంతాలను వారు పరశీలిస్తూ,తగిన మార్గదర్శకాలను తెలియజేశారు.తొలుత డిఎస్పి కార్యాలయమునకు చేరుకొని,డివిజన్ పరిధిలోని పలు స్టేషన్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.దీర్ఘకాలిక కేసులను సత్వరంగా పరిష్కరించాలని అదేశించారు.తదుపరి ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ట్రాఫిక్ విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని,ఎక్కడా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు మహించాలని వారు తెలియజేశారు.ఎ -హానాలలో పరిమితికి మించి ప్రయాణికులు ఉండరాదని,వాహన తనిఖీలను ముమ్మరం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం,సిఐ రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఓబులేసుకోనలో స్వాతి నక్షత్రం పూజలు



: శ్రీలక్ష్మీనరసింహస్వామిని అలంకరించిన దృశ్యం

తాడిపత్రిరూరల్, జూన్ 29 ప్రభాతవార్త

మండలంలోని ఓబులేసుకోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్ష త్రం స్వాతినక్ష త్రాన్ని పురస్కరించుకుని ఉదయం అర్చకు లు యోగానందశర్మ స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తిరుమంజనసేవ తదితర పూజా కార్య క్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో వుంచి ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# నేడు చేపల చెరువు వేలం

యల్లనూరు, జూన్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రం సమీపంలో వున్న చెరువులోని చేపలు అమ్ముకునే హక్కు పొందేందుకు సచివాలయం-2లో శుక్రవారం ఉదయం 11 గంటలకు బహిరంగవేలం నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ అధికారి పక్కీరయ్య తెలిపారు. వెయ్యి రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన తెలియచేశారు.

# డా.వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా జాబితా విడుదల

యాడికి, జూన్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా జాబితాను విడుదల చేసినట్లు గురువారం మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాష తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన ఈ జాబితాను రైతులు తమ తమ పరిధిలో వున్న సంబంధిత రైతు భరోసా కేంద్రంలో ఈ జాబితా వివరాలు తెలుసుకోవాలని సూచించారు. శుక్రవారం నుండి జూలై 3వతేదీ వరకు సామాజిక తనిఖీ కొరకు రైతు భరోసా కేంద్రంలో ఈ జాబితాను వుంచనున్నట్లు రైతులు ఏవైనా సమస్యలు వుంటే జూలై 4వతేదీ సాయంత్రంలోపు తమ అర్జీలను అందిస్తే ఉన్నతాధికారులకు సమాచారం పంపడం జరుగుతుందని ఎఒ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

